# మూఢనమ్మకమా వర్థిల్లు!

"నువ్వు ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు నేను ఎదురుగా వస్తానుండు. ఉద్యోగం తప్పకుండా వస్తుంది" అనేది అనసూయగారు. ఆవిడ మా రామకృష్ణ పదహారో ఇంటర్వ్యూకి వెడుతున్నప్పుడు కూడా ప్రతిసారీ చెబుతున్నట్టుగానే మళ్ళీ చెప్పింది.

"నేను ఆఫీస్‌కి వెడదామని బయటకి రాగానే నల్లపిల్లి ఎదురొచ్చింది సార్. మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి, ఓ పది నిమిషాలు కూర్చుని మంచినీళ్ళు తాగి బయల్దేరాను. అందుకే ఇవాళ కూడా ఆలస్యమయింది" అంటాడో అప్పారావ్ వాళ్ళ ఆఫీసర్‌తో.

"లక్షసార్లు చెప్పాను, అమావాస్యనాడు ప్రయాణం చేయకూడదురా అంటే వినకుండా బయల్దేరాడు. ఇప్పుడేమయింది రైలు మిస్సయాడు" అంటాడు ఇంకో పరంధామయ్య, మరీ ఆలస్యంగా స్టేషన్‌కి వెళ్ళిన కొడుకుని ఉద్దేశించి.

మన గంగూలీ, ఒకసారి గెలిచిన టీమ్‌ని మారిస్తే ఓడిపోతామేమోననే భ్రమతో బౌలింగ్ పిచ్‌మీద కూడా ఇంకో ఎక్స్‌ట్రా బౌలర్‌ని తీసుకోకుండా బరిలోకి దిగుతాడు. ఈ బెంగాలీ బాబుకి, మన ఆంధ్రుల బాబుల బాబుల కన్నా ఇలాటి నమ్మకాలు ఎక్కువట.

ప్రపంచ కప్పు పోటీలకి ముందు ఎందరో జ్యోతిష్య మహానుభావులు గ్రహగతులని లెక్కించి, ఈసారి ఇండియా ఖచ్చితంగా గెలుస్తుందని ఖచ్చితంగా చెప్పారు. తీరా గెలవకపోయేసరికి "అరె మేం గంగూలి సచిన్ జాతకాలని చూసి అలా చెప్పాంకానీ, పాంటింగ్ మార్టిన్‌ల జాతకాలను చూడనేలేదు. వాళ్ళకే గ్రహబలం ఎక్కువుంది. అలా వున్నప్పుడు మనవాళ్ళు ఓడిపోరూ మరి" అన్నారు.

అయ్యో వరల్డ్ కప్ గెలవాలంటే క్రికెట్, బ్యాటూ బాలూతో ఆడాలి కానీ జ్యోతిష్యంతో కాదు బాబూ అని మా బాలూ అంటున్నప్పుడు, అసలు ఈ జనానికి ఈ మూఢ నమ్మకాల పిచ్చేమిటీ, ఈ మూఢ నమ్మకాలు మనకొక్కళ్ళకేనా, ప్రపంచంలో మిగతా సంస్కృతులలో కూడా వున్నాయా అన్న కుతూహలం కలిగింది. దాంతో కొంత రీసెర్చి చేయాల్సి వచ్చింది. సేకరించిన ఎన్నో పేజీల సమాచారంలోనించి, తెలుసుకోటానికి నాకు సరదాగా వున్నాయనిపించినవి ఇక్కడ వ్రాస్తున్నాను.

ఏ గృహాల్లో ఏఏ గ్రహాలున్నాయో కానీ, ప్రపంచమంతటా ఈ మూఢ నమ్మకాలు చాల వున్నాయి.

ఇందాక నల్లపిల్లి ఎదురొస్తే మనకి మంచిది కాదని అనుకున్నాం కదా. అది ఎందుకంటే ఈజిప్ట్‌లో నల్లపిల్లి ఓ దేవత. పూజ చేసేవారుట. అక్కడ క్రిస్టియానిటీ వచ్చాక, వాళ్ళు పరమత ద్వేషంతో చేసిన ప్రచారం నల్లపిల్లి అశుభ శకునం

అని. బ్రిటిష్‌వారు మనకి అంటగట్టిన అశుభాలలో ఇదొకటి. కానీ గమ్మత్తేమిటో తెలుసా? మీరు మూఢంగా కాదు నిజంగా నమ్మాలిది. ఇంగ్లాండ్‌లో నల్లపిల్లులు అదృష్టం ఇస్తాయని ఒక పెద్ద నమ్మకం.

కెనడాలో కొత్త పెళ్ళికూతురికి, నల్లపిల్లిగానీ, తెల్ల పావురంగానీ ఎదురొస్తే ఆవిడ బాగా సుఖపడుతుందిట. అంతేకాదు ఆ రోజు పెళ్ళి గౌన్ మీద ఒక సాలెపురుగుంటే మరీ మంచిదిట. కెనడాకి సాలెపురుగులు ఎగుమతి చేస్తే, మన వరల్డ్ బాంక్ అప్పులన్నా తీరతాయి పెళ్ళికూతురు గురించి చెప్పుకుంటున్నాం కనుక అలాటివి మరి కొన్ని స్పెయిన్‌లో పెళ్ళికూతురు పెళ్ళికొడుక్కి ఎప్పుడూ ఎడమ వేపే వుండాలిట. ఎవరైనా ఆమెను చంపబోతే, పెళ్ళికొడుకు కుడి చేత్తో కత్తి తీసి రక్షించటానికి మరి ఎడమ చేతి వాటం వాడయితే?

చైనాలో ఎర్రగొడుగు పెళ్ళికూతుర్ని దుష్టశక్తుల బారినించీ కాపాడుతుందిట. ఫిన్‌లాండ్‌లో పెళ్ళి సమయంలో పెళ్ళికూతురు ఒక అగ్గిపెట్టెని చేతిలో పెట్టుకుంటుందిట. వాళ్ళ ప్రేమ జ్వాలలు అలా ఎగసిపోవాలని.

యునైటెడ్ కింగ్డమ్‌లో పెళ్ళికూతురికి బిచ్చగాళ్ళు ఎదురయితే మంచిదిట. ఈ మూఢ నమ్మకానికి కారణం తెలీదు కానీ అక్కడ బిచ్చగాళ్ళు మాత్రం అరుదు ఇండియానుంచి బిచ్చగాళ్ళని అక్కడికి ఎగుమతి చేయటం లాభకరమేమో ఒకే రాయికి రెండు పిట్టలు

గ్రీసు అనే దేశంలో పెళ్ళి గౌన్ ఒకేసారి, పెళ్ళి రోజునే వేసుకోవాలిట ఎన్నిసార్లు వేసుకుంటే అన్నిసార్లు పెళ్ళవుతుందనే అపనమ్మకంతో, షాపుల్లో కూడా కొనుక్కునే ముందర వేసుకుని చూడరుట.

ఆస్ట్రేలియాలో పెళ్ళిదండలో ఎర్రగులాబులు వుండకూడదుట. రక్తపాతంతో ఆ నూతన దంపతులలో ఒకళ్ళు చనిపోతారని. ఇది వింటుంటే తెలుగు సినిమా చూస్తున్నట్టుంది.

మెక్సికోలో పెళ్ళిదండలో ముత్యాలు వుండకూడదుట. ముత్యాలు కన్నీళ్ళకి చిహ్నం అని వారి నమ్మకం.

ఇటలీలో పెళ్ళికొడుకు జేబులో ఒక ఇనప ముక్క వేసుకుంటాడు, దుష్టశక్తులు అతన్ని అంటకుండా.

పెళ్ళి రోజు వాన వస్తే, కెనడాలో దంపతులు సుఖపడి ఎక్కువ పిల్లల్ని కంటారని నమ్మకం. అదే మరికొన్ని సంస్కృతులలో, ఆ వాన నీళ్ళు వాళ్ళ జీవితాలకి కన్నీళ్ళు అవుతాయని, వాన రాని రోజున పెళ్ళి చేసుకుంటారుట. అంటే అక్కడ వానాకాలం పెళ్ళిళ్ళు వుండవనా?

తూర్పు దేశాల్లో పెళ్ళికూతుర్ని పెళ్ళికొడుకు ఎత్తుకుని ఇంట్లోకి తీసుకురావటం ఎందుకో తెలుసా? నడుస్తూ రాబోయి, ఆమె కాలు జారి కింద పడిపోతే, వారి వివాహంకూడా అలాగే నేలపాలవుతుందని. మరి ఓ మందపాటి పెళ్ళికూతుర్ని మోయలేని సన్నపాటి పెళ్ళికొడుకు కింద పడితే?

కొత్తగా పెళ్ళైన దంపతులు హనీమూన్‌కి వెడుతుంటే వాళ్ళ కారుకి వెనకాల

టిన్ డబ్బాలెందుకు కడతారంటే, ఆ శబ్దం దుష్టశక్తుల్ని తరిమేస్తుందని

ఆస్ట్రేలియాలో పెళ్ళిరోజున టోస్ట్ చేసిన వైన్ గ్లాసుల్ని పగలకొట్టేస్తారు ఎందుకంటే, అవి అంతకన్నా మంచి పనికి పనికిరాకూడదని.

అమెరికాలో పెళ్ళప్పుడు అక్షింతలు చల్లటం, దుష్టశక్తులకి ఆహారం వేసి వాటిని శాంతపరచటం కోసం. అమెరికాలోనే కొంతమంది, అక్షింతలు అలా విత్తనాలు చల్లినట్టు చల్లితే పిల్లలు పుడతారని నమ్ముతారు.

మరి పెళ్ళి రోజు ఉంగరాలు ఎందుకు పెట్టుకుంటారు? ఉంగరం గుండ్రంగా ఆదీ అంతూ లేకుండా వుంటుంది కనుక. జీవితం కూడా అలాగే వుండాలనే కోరికతో వేలికి ఉంగరం పెట్టుకుంటారు.

జ్యూయిష్‌వారు బహుమతులుగా ఏమిచ్చినా తీసుకుంటారు కానీ కత్తులు పెళ్ళి బహుమతులుగా తీసుకోరు. మరీ తప్పకపోతే అలా బహుమతి ఇచ్చిన వారికి ఒక పైసా (మన పైసా కాదు, వాళ్ళది) ఇచ్చి, అది కొనుక్కున్నట్టుగా భావిస్తారుట.

ఇంగ్లాండ్‌లో పెళ్ళి రోజున కోసిన కేక్‌లో పైన వున్న ముక్కని, వాళ్ళకి పిల్లాడు పుట్టేదాకా వుంచి బాప్టిజం చేసే రోజున ఇస్తారుట

ఈజిప్ట్‌లో తుమ్మితే దుష్టశక్తులు పారిపోతాయని ఒక నమ్మకం చిన్నప్పుడు గుంటూరులో మా ఇంటి దగ్గర కెవియల్నరసింహారావుగారు తుమ్మితే, ఆ శబ్దానికి భయపడి పిల్లలందరూ పారిపోయేవాళ్ళు.

దుష్టశక్తులు పారిపోతాయని ఎక్కువగా తుమ్ముతుంటే, దుష్టక్రిములు వ్యాపించి ప్లేగ్ వ్యాధి వచ్చిందిట. ఆ వ్యాధినించి దేవుడు కాపాడాలని బ్లెస్ యూ అని ఇంగ్లీషులో దీవించేవారుట. తెలుగులో చిరంజీవ అలాగే వచ్చిందేమో.

శుక్రవారం 13వ తారీఖు అమెరికాలో మంచిది కాదు. ఆడమ్ ఈవ్‌లని శుక్రవారమే బహిష్కారం చేశారు. ఏసుక్రీస్తుని శుక్రవారమే శిలువ వేశారు. వారి మతం ప్రకారం 13 భూతాలు వున్నయిట. అందుకని శుక్రవారం 13వ తారీఖున ఏదో చెడు జరుగుతుందని నమ్మకం.

జపాన్‌లో నాలుగు అంకె అనర్థానికి సంకేతం. హోటళ్ళలో మూడవ అంతస్థు తరువాత ఐదో అంతస్థు వుంటుంది. మూడవ నెంబరు బిల్డింగు పక్కన ఐదో బిల్డింగ్ వుంటుంది. బుడుగు లెక్కల్లాగ. హైద్రాబాద్‌లో ఇళ్ళ నెంబర్లలాగ.

చైనాలో 9 మోక్షానికీ, 6 కానీ 8 కానీ సంపన్నతకీ, 2 స్నేహానికీ మంచివి అంటారు. వాటికి 5 కలిపితే మళ్ళీ మంచివి కాదుట. అంటే 59కి మోక్షం రాదు. 56కి 58కి బీదవాళ్ళయిపోతారు, 52కి శతృత్వం వస్తుందని అక్కడ నమ్మకం.

ఇలా ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం. మూఢ నమ్మక సిద్ధాంతం.. అజ్ఞానపు అంధకారం..

దేశాలు వర్ధిల్లినంత కాలం ఈ మూఢ నమ్మకాలూ వుంటాయి.

అందుకే మూఢ నమ్మకమా వర్ధిల్లు అనాలేమో।

* * *